వైభవంగా లక్ష్మీనరసింహుడి నిత్య తిరుకల్యాణోత్సవం

నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ వెలుపలి ప్రకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. భక్తులు పాల్గొని కల్యాణ తంతును వీక్షించారు. స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు వైభవంగా సాగాయి. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం నిర్వహించారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 26,14,890 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

సంక్షేమ వసతిగృహాల్లో వసతులు మెరుగు పర్చాలి

జడ్పీ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ తోటకూరి అనూరాధ

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అనూరాధ

భువనగిరి కలెక్టరేట్, జూన్ 20 : సంక్షేమ వసతిగృహాల్లో పూర్తి స్థాయిలో వసతులు మెరుగు పర్చాలని జడ్పీ స్థాయీసంఘం చైర్‌పర్సన్ తోటకూరి అనూరాధ బీరయ్య అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఆరవ స్థాయీ సంఘం(సాంఘిక సంక్షేమం) సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. మౌళిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు మెరుగైన విద్య అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఐదు సంవత్సరాల కాలంలో అధికారులు అందించిన సహకారం మరువలేనిదని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ ఎన్. శోభారాణి, డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలయ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్

ఆత్మకూరు(ఎం), జూన్ 20 : ఆలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను విడుతల వారీగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించారు. మండలంలోని కోరటికల్‌లో శంభులింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పోతిరెడ్డిపల్లి, పల్లెర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తండా మంగమ్మాశ్రీశైలం గౌడ్, జడ్పీటీసీ కొడిత్యాల నరేందర్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, ట్రాన్స్‌కో డీఈ మల్లిఖార్జున్‌గౌడ్, ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, హంసమ్మ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ నగేశ్ పాల్గొన్నారు.

హెచ్‌కానిస్టేబుల్‌కు సీపీ జోషి అభినందన

అనిల్‌ను అభినందిస్తున్న సీపీ తరుణ్ జోషి

యాదగిరిగుట్ట, జూన్ 20: పాన్ ఇండియా నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించిన యాదగిరిగుట్టకు చెందిన హెడ్ కానిస్టేబుల్ అంజోజు అనిల్‌కుమార్ గురువారం హైదరాబాద్‌లోని నేరేడుమెట్‌లో రాంచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీ జోషి అనిల్‌కుమార్‌ను అభినందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఫిబ్రవరి 22 నుంచి 25 వరకు థాయ్‌లాండ్‌లో జరిగిన 28వ ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అనిల్‌కుమార్ నాలుగు పతకాలు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియా జరుగనున్న అంతర్జాతీయ పోటీల్లోనూ పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సీఐ శ్రీకాంత్ ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై 24న ధర్నా

సీఐటీయూ జిల్లా కార్యదర్శి బోడ భాగ్య

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి బోడ భాగ్య

భువనగిరి అర్బన్, జూన్ 20: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బోడ భాగ్య తెలిపారు. గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం నాయకురాళ్లు వసంత, పసుపుల బుచ్చమ్మ, వరమ్మ, లక్ష్మి, లలిత పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలని వినతి

భువనగిరి అర్బన్, జూన్ 20: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీను వెంటనే అమలు చేయాలని కోరుతూ సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డికి వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆసరా, దివ్యాంగుల పింఛన్లను రూ.2వేలు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ నేటికీ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు పూర్తి స్థాయిలో అమలు చేసే వరకు పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ నాయకులు ఎల్లయ్య, వల్దాస్ అంజయ్య పాల్గొన్నారు.

నేడు పైలాన్ పార్కులో యోగా డే

చౌటుప్పల్ : ఈ నెల 21న ఉదయం 7 గంటలకు చౌటుప్పల్ పట్టణంలోని పైలాన్ పార్కులో యోగా డే వేడుకలను నిర్వహిస్తున్నట్లు యోగా గురువు పాలకూర్ల పాండు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేజన సుఖినోభవంతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి

- జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జండగే
- జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

వలిగొండ : విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జండగే

భువనగిరి కలెక్టరేట్ : బస్వాపురం పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ నిర్మల

భూదాన్‌పోచంపల్లిలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి

వలిగొండ, జూన్20: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జండగే అన్నారు. గురువారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని వేంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. నులి పురుగుల బారిన పడిన విద్యార్థుల్లో ఎదుగుదల లోపిస్తుందని, రక్తహీనతతో ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. 2 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సున్న వారికి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పాపారావు, జిల్లా ఉప వైద్యాధికారి యశోద, డాక్టర్ వంశీకృష్ణ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమన్ కల్యాణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకోజు భాస్కర్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకే మాత్రలు

భువనగిరి కలెక్టరేట్ : చిన్నారుల్లో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఎంపీపీ నరాల నిర్మలావెంకట స్వామి సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని బస్వాపురం, అనంతారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఆమె పంపిణీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న మాత్రలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, బొల్లేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యామిని, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 19 సంవత్సరాల లోపు పిల్లలు 8,595 మంది ఉన్నారని, వారందరికి మాత్రలు వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీవాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోట విజయభాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- భువనగిరి అర్బన్ : పట్టణంలోని 8వ వార్డులోగల పాఠశాల విద్యార్థులకు వార్డు కౌన్సిలర్ పంగరెక్క స్వామి నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ప్రేమలత, శోభ, స్కూల్ హెచ్ఎం ప్రధానోపాధ్యాయుడు యాదయ్య పాల్గొన్నారు.
- తుర్కపల్లి : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఎంపీపీ బూక్యా సుశీలారవీందర్. దత్తాయపల్లి, ఇబ్రహీంపురం పాఠశాలల్లో ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జాన్సీలక్ష్మీబాయి, ఎంపీటీసీ బొరెడ్డి వనజ, వైద్యాధికారి సుధీర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- మోటకొండూర్ : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం తాసీల్దార్ శాంతిలాల్, మండల వైద్యాధికారి విజయ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- బొమ్మలరామారం : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మైలారం ఈదమ్మ, వైద్యాధికారులు సుమలత, కాంత్రికుమార్, సీహెచ్ఓ మురళీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.
- రామన్నపేట : మండలంలోని ఇంద్రపాల నగరం జడ్పీహెచ్ఎస్‌లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ పూస బాలమణి ప్రారంభించారు. కార్యక్రమంలో మునిపంపుల పీహెచ్‌సీ వైద్యాధికారి అశ్విన్‌కుమార్, హెచ్ఈఓ గోపాల్, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.


తుర్కపల్లిలో బాలుడికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎంపీపీ సుశీల

మోటకొండూరు : చిన్నారికి మాత్ర వేస్తున్న తాసీల్దార్ శాంతిలాల్


రామన్నపేట: విద్యార్థినికి అల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎంపీపీ బాలమణి

22న క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

బీబీనగర్, జూన్ 20 : రాష్ట్రంలోని క్రీడాపాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ 4వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 22న ఉదయం 10 గంటలకు జడ్పీహెచ్ఎస్ బీబీనగర్‌లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సెలక్షన్ కమిటీ కన్వీనర్ సంగీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈఓ నాగవర్ధన్ రెడ్డి పర్యవేక్షణలో జరుగనున్న సెలెక్షన్స్‌కు ఆసక్తి గల విద్యార్థులు వయస్సు ధ్రువీకరణ పత్రాలు, 3వ తరగతి స్టడీ సర్టిఫికెట్లు, 5 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని సూచించారు. ఈ పోటీలల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

భూదాన్‌పోచంపల్లిలో..

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ నెల 22న స్పోర్ట్ స్కూల్‌లో చేరికకు మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనునట్లు ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దొడ్డి కాళ్లు, ప్లాట్ ఫీట్, వెన్నెముక వంగిన వారు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్న విద్యార్థులు ఈ పోటీలకు అనర్హులని పేర్కొన్నారు.

నేడు పోచంపల్లి అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 20 : ఈ నెల 21న పోచంపల్లి అర్బన్ బ్యాంక్ ఎన్నికలను నిర్వహించనునట్లు ఎన్నికల అధికారి జి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌ల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే వారు బ్యాంక్ జారీ చేసిన గుర్తింపు కార్డు, లేదా ఇతర గుర్తింపు కార్డు వెంట తీసుకొని రావాలని సూచించారు.

చింతలకుంట వద్ద గుర్తుతెలియని మృతదేహం

బొమ్మలరామారం, జూన్20 : మండలంలోని పెద్దపర్వతాపూర్ గ్రామ శివారులోని చింతలకుంట సమీపంలో గురువారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ రాఘవేంద్రగౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం

భువనగిరి కలెక్టరేట్, జూన్ 20 : మండలంలోని చందుపట్ల అంగన్‌వాడీ కేంద్రం-1లో గురువారం సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన, నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ దంతూరి భాగ్యమ్మ, ఆరోగ్య సిబ్బంది, తల్లితండ్రులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, జూన్ 20: రైతుల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎదుళ్ల గూడెం పరిధిలో రూ. 15.70 లక్షలతో ఎత్తిపోతల మోటర్లకు మరమ్మతులు చేపట్టి పునర్మించిన వెంటేశ్వర ఎత్తిపోతల పథకాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని రైతులకు సాగునీరందించే బునాదిగాని కాల్వ, భీమలింగం కాల్వ, ధర్మారెడ్డిపల్లి కాల్వను అభివృద్ధి చేసి వాటి ద్వారా చెరువులు నింపి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం దివీస్ లాబొరేటరీస్ చౌటుప్పల్ సహకారంతో ఎదుళ్లగూడెంలో రూ.5.36 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గొల్నేపల్లి రామసముద్రం చేరువుకు నీరందించే ధర్మారెడ్డిపల్లి కాల్వను పరిశీలించారు. కాల్వను పునరుద్ధరించి రైతులకు నీరందించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఈఈ గోపాల్, డీఈ శాంతి, ఏఈ అర్జున్, స్పెషల్ ఆఫీసర్ దివ్య, కందాళ రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ గూడూరు వెంకట్‌రెడ్డి, రవి, శివశాంత్‌రెడ్డి, ఉపేందర్‌బోస్, ఎత్తిపోతల కమిటీ సభ్యులు, దివీస్ అధికారి సాయికృష్ణ పాల్గొన్నారు.

ఆడ బిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి : ఎంపీపీ ఉమాదేవి

కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎంపీపీ గుత్తా ఉమాదేవి

సంస్థాన్ నారాయణపురం, జూన్20: నిరుపేద ఆడబిడ్డలకు అండగా ఉండేందుకు కల్యాణలక్ష్మి పథకం దోహద పడుతుందని ఎంపీపీ గుత్తా ఉమాదేవి అన్నారు. మండలానికి చెందిన 37 మంది లబ్ధిదారులకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను జడ్పీటీసీ వీరమల్ల భానుమతిగౌడ్‌తో కలిసి ఆమె పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు, పుస్తాకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణ, ఎంపీటీసీలు నర్రి నరసింహ, మర్రి వసంత, బచ్చన గోని గాలయ్య, ఈసం యాదయ్య, వైద్యాధికారి జ్యోత్స్న పాల్గొన్నారు.

వచ్చే నెలలో ఉపాధి హామీ పనుల తనిఖీ

- అడిషనల్ డీఆర్‌డీఓ సురేశ్

మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ సురేశ్

రామన్నపేట, జూన్ 20: వచ్చే నెల మొదటి వారంలో ఉపాధిహామీ పథకం పనులను కేంద్ర ప్రభుత్వ బృందాలు తనిఖీ చేయనున్నట్లు అడిషనల్ డీఆర్‌డీఓ గుర్రం సురేశ్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. సిబ్బంది అన్ని రికార్డులను సిద్ధం చేసి పెట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ యాకూబ్ నాయక్, ఏపీఓ వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

ధర్మారెడ్డి కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నర్సింహ

రామన్నపేట, జూన్20: ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వల ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాపోలు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సిరిపురం- వెల్మినేడు గ్రామాల మధ్య ధర్మారెడ్డిపల్లి కాల్వపై నిర్మించిన కల్వర్టులను స్థానిక పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కల్వర్టుపై గోడలు నిర్మించక పోవడంతో రైతులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట నాయకులు గోశిక చక్రపాణి, పున్న వెంకటేశం, సాయిని శేఖర్, గాదే జాని, గంజి వీరయ్య, కొంపెల్లి వీరేశం, యాదయ్య ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

సంస్థాన్ నారాయణపురం, జూన్6 : రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ హెచ్చరించారు. మండలంలోని వావిళ్లపల్లి, సర్వేల్, నారాయణపురం గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను గురువారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రైతులు సాగు చేసిన పత్తి చేలను, ఆయిల్ పామ్ తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనాలు చేశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ అరుణ, ఏఈఓలు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం)లో..

ఆత్మకూరు(ఎం),జూన్20 : ఫర్టిలైజర్ దుకాణాల వారు నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంతో పాటు లింగరాజ్‌పల్లిలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల నిల్వలు, ధరలను చూపుతూ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదు అందించాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ సరిత ఉన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ చేసిన కనకరాజు

రాజాపేట, జూన్ 20 : మండలంలోని దూది వెంకటాపురంలో గల ప్రాథమిక, జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నక్కీర్త కనకరాజు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సుమారు 8 వందల నోట్ బుక్స్‌ను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చామకూర గోపాల్ గౌడ్, ఎంపీటీసీ ఎర్రోళ్ల స్వరూపా బాబు, నాయకులు వంగాల భిక్షపతి, ధర్మారెడ్డి, రాజు, సిద్ధులు, కృష్ణ పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా ఎరువులు అందించాలి

అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ధర్నా చేస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

ఆలేరురూరల్, జూన్20 : రైతులకు ప్రభుత్వమే ఉచితంగా ఎరువులు సరఫరా చేయాలని కోరుతూ అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆలేరు తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చీరబోయిన రాజయ్య, కుమార్, బాబు, గోపాల్‌రెడ్డి, కొమురయ్య, కుమార్, వెంకటేశ్, మైసయ్య పాల్గొన్నారు.

గంధమల్ల పాలసంఘం చైర్మన్‌గా వెంకటేశ్‌యాదవ్

వెంకటేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

తుర్కపల్లి, జూన్20 : మండలంలోని గంధమల్ల మల్లికార్జున పాలసంఘం ఎన్నికలు గురువారం నిర్వహించారు. సంఘం చైర్మన్‌గా జక్కుల వెంకటేశ్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రైతులు, గ్రామస్తులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో జెల్ల వెంకటేశ్, గణేశ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.